నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
మంగళవారం
17-06-2025
పేజీలు: 02





## మరో ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక లోపం



మరో ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక లోపం చోటుచేసుకుంది. శాన్ ఫ్రాన్సిస్కో నుంచి కోల్కతా మీదుగా ముంబై వెళ్లాల్సిన ఏఐ 180 అనే ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయాణికులు అందరినీ కోల్కతాలోనే దించేసింది ఎయిర్ ఇండియా సిబ్బంది. అలాంటి సాంకేతిక సమస్య వచ్చినప్పుడు అలాగే ప్రయాణిస్తే ఖచ్చితంగా అహ్మదాబాద్ లాంటి ప్రమాదం జరిగే.. అవకాశం ఉందని గ్రహించిన ఎయిర్ ఇండియా సిబ్బంది... ప్రయాణికులను దించేశారు. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేశారు. అయితే ఆ సాంకేతిక సమస్య గురించి అధికారులు... ఆరాధిస్తున్నారు. అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమానం ప్రమాదానికి గురైన తర్వాత ఇలా వరుసగా అన్ని విమానాలకు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. మొన్న రాత్రి హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లే విమానంలో కూడా చిన్నపాటి మంటలు కూడా వచ్చాయి. దీంతో విమానం ఎక్కాలంటే జనాలు భయపడిపోతున్నారు.

## కర్నాటకలో బైక్ ట్యాక్సీ సర్వీసులు బంద్


బెంగళూరుతో సహా కర్నాటకవ్యాప్తంగా బైక్ ట్యాక్సీ సేవలు నిలిచిపోయాయి. ఆ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ర్యాపిడో, ఉబర్, ఓలా సంస్థలు తమ సేవలను నిలిపివేశాయి. హైకోర్టు ఆదేశానుసారం తమ సేవలను నిలిపివేస్తున్నట్లు ర్యాపిడో పేర్కొంది. సేవలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని తెలిపింది. బైక్ ట్యాక్సీ సేవలను ఉబర్, మోటో కొరియర్ కింద మార్చగా.. ఓలా తన యాప్‌లో బైక్ ట్యాక్సీ అనే ఆప్షన్‌ను పూర్తిగా తొలగించింది. మోటార్ వెహికల్ చట్టంలో బైక్ ట్యాక్సీల ప్రస్తావన లేదు. దీంతో బైక్ ట్యాక్సీ సేవలను నిలిపివేయాలని కర్నాటక హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను డివిజన్ బెంచ్ సమర్థించింది. ఇక జూన్ 20లోగా దీనిపై స్పందన తెలియజేయాలని కర్నాటక ప్రభుత్వాన్ని అక్కడి హైకోర్టు ఆదేశించింది.




## కుప్పంలో దారుణం
## అప్పు చెల్లించలేదని... చెట్టుకు కట్టేసి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా కుప్పం మండలం దారుణం వెలుగులోకి వచ్చింది. ఓ మహిళను అప్పు తీర్చలేదని లాక్కెళ్లి చెట్టుకు కట్టేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నారాయణపురం గ్రామంలో శిరీష, తిమ్మరాయప్ప అనే దంపతులు నివసిస్తున్నారు. తిమ్మరాయప్ప అదే గ్రామానికి చెందిన మునికన్నప్ప వద్ద 3 సంవత్సరాల క్రితం 80,000 వేలు రూపాయలు అప్పు తీసుకున్నాడు. అప్పు తీర్చలేక భార్య శిరీష (25) బిడ్డలను గ్రామాన్ని వదిలి భర్త తిమ్మరాయప్ప ఎక్కడికో వెళ్ళిపోయాడు. కూలీ పనులు చేసుకుంటూ పిల్లలు పోషించుకుంటూ శిరీష అప్పులు తీరుస్తుంది. సకాలంలో అప్పు చెల్లించలేదని రోడ్డుపై వెళ్తుండగా ఆమెను అసభ్యకరమైన పదజాలంతో మునికన్నప్ప దూషించాడు. తన అప్పు డబ్బులు ఇవ్వకపోతే చంపిస్తామని బెదిరింపులకు దిగాడు. ఈడ్చుకొంటూ వెళ్ళి, తాడుతో బలవంతంగా వేప చెట్టుకు కట్టేశాడు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ గా మారింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు.ముని కన్నప్ప అతని భార్య వెంకటమ్మ, కొడుకు రాజా, కోడలు జగదీశ్వరి పై కేసు నమోదు చేశామని కుప్పం అర్బన్ సిఐ శంకరయ్య వెల్లడించారు.




## కుప్పం ఘటనపై
## సీఎం చంద్రబాబు సీరియస్

అప్పు తీర్చలేదని మహిళను చెట్టుకు కట్టేసిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. కుప్పంలో మహిళపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలకు సీఎం ఆదేశించారు. అప్పు తీర్చలేదని కుప్పం మండలం నారాయణపురం గ్రామంలో మహిళపై దాడి ఘటన తీవ్ర కలకలం రేపింది. మహిళను మునికన్నప్ప, అతని కుటుంబ సభ్యులు చెట్టుకు కట్టేసి అమానుషంగా వ్యవహరించారు. జిల్లా ఎస్పీతో సీఎం మాట్లాడారు. నిందితుడిని ఇప్పటికే అరెస్టు చేశామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి జిల్లా ఎస్పీ తెలియజేశారు. మహిళను చెట్టుకు కట్టేసి హింసించిన వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటువంటి చర్యలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా పోలీసులు చూడాలన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉండాలని, వారి వివరాలను జిల్లా అధికారులకు అందజేయాలని సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే బాధితులకు ఎందుకు అప్పులు అయ్యాయి అనే విషయాన్ని సేకరించి సీఎం పేషీకి పంపించాలని ఆదేశాలిచ్చారు. ఈ విషయంపై చిత్తూరు జిల్లా కలెక్టర్‌తోనూ సీఎం మాట్లాడి.. ఘటన వివరాలు పంపాలని ఆదేశాలు జారీ చేశారు.



## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిలయ్యి ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య

మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్ లోని జయశంకర్ కాలనీకి చెందిన అక్షయ అనే విద్యార్థి ఇంటర్ సెకండ్ ఇయర్ గణితంలో ఫెయిలయ్యి సప్లిమెంటరీ పరీక్ష రాయగా, అందులోనూ ఫెయిల్ అవ్వడంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న అక్షయ, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం దాస్ తండాకు చెందిన గుగులోత్ హారిక (17) ఇంటర్ మొదటి సంవత్సరంలో బాటనీ పరీక్ష ఫెయిల్ అయ్యి సప్లిమెంటరీ రాయగా అందులోనూ ఫెయిల్ అవ్వడంతో, ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న హారిక, సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం మహబత్ పూర్ గ్రామానికి చెందిన వెంకటరమణ (18) ఇంటర్ సెకండ్ ఇయర్ లో ఫెయిల్ అవ్వడంతో, సప్లిమెంటరీ పరీక్షలు రాసి అందులో ఒక్క సబ్జెక్టు ఫెయిల్ అవ్వడంతో మనస్తాపంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న వెంకటరమణ.



## నేడు సిట్ ఎదుటకు పీసీసీ చీఫ్

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణను వేగవంతం చేసింది. దాదాపు 600 మంది ఫోన్ ట్యాపింగ్ బాధితులు ఉన్నట్లు ఇప్పటికే తేలటంతో, వారి నుంచి సిట్ అధికారులు వాంగ్మూలాలు సేకరిస్తున్నారు. దీంట్లో భాగంగానే టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నుంచి వాంగ్మూలం సేకరించేందుకు సిట్ సిద్ధమైంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తన ఫోన్ ట్యాపింగ్ అయినట్లు మహేశ్ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే, తమ ఎదుట విచారణకు హాజరై వాంగ్మూలం ఇవ్వాల్సిందిగా సిట్ అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. దీంతో మంగళవారం జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయానికి మహేశ్‌కుమార్ వెళ్లనున్నారు. కాగా, బాధితుల నుంచి వాంగ్మూలాల సేకరణలో భాగంగా వికారాబాద్‌కు చెందిన ఉమ్మడి రంగారెడ్డి జడ్పీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు పట్లోళ్ల మహిపాల్ రెడ్డిని సిట్ అధికారులు సోమవారం 45 నిమిషాలపాటు విచారించారు. తొలుత ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్సైలు ప్రాథమికంగా ప్రశ్నించి వివరాలు సేకరించగా, ఆ తర్వాత ఏసీపీ వెంకటగిరి సుమారు అరగంటపాటు విచారించారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, అప్పటి పీసీసీ చీఫ్, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డితో తరచూ మాట్లాడిన కాల్ డేటాను ఆయన ముందు ఉంచి ప్రశ్నించారు. ఆయా సమయాల్లో వారితో మాట్లాడింది వాస్తవమేనని మహిపాల్ రెడ్డి అధికారులకు వాంగ్మూలం ఇచ్చారు. ఎన్నికల ముందు ఒక ఫోన్ నెంబరు ఉపయోగిస్తూ, మరో ఫోన్‌లో వాట్సాప్ ఎందుకు వాడాల్సి వచ్చిందని సిట్ బృందం ప్రశ్నించగా... అప్పటికే తన ఫోన్ ట్యాపింగ్ అవుతున్నట్లు సందేహం కలగటంతో భద్రతా కారణాల రీత్యా అలా చేశానని మహిపాల్ రెడ్డి సిట్ తెలిపినట్లు సమాచారం.



## ఏం అందంరా బాబు

RX100 మూవీ హీరోయిన్ మరోసారి తన పరువాలు చూపిస్తూ సోషల్ మీడియాలో కుర్రవాళ్ల చూపులకు వల విసురుతోంది. ఫస్ట్ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన ఈముద్దుగుమ్మ తర్వాత చకిలపడింది.నెగిటివ్ షేడ్ ఉన్న పాత్రతో కుర్రాళ్ల హృదయాల్ని గెలుచుకున్న ఈ అమ్మడు ఇప్పుడు తన క్లీవేజ్ పార్ట్ చూపిస్తూ కుర్రాళ్ల హార్ట్ బ్లాస్టర్ చేస్తోంది. పాయల్ రాజ్‌పూజ్ కి టాలీవుడ్‌లో అవకాశాలు వచ్చినప్పటికి సక్సెస్ మాత్రం దరిదాపుల్లోకి కూడా రావడం లేదు.అందుకే సోషల్ మీడియాని అడ్డాగా మార్చుకొని అందాలను ఎర వేస్తోంది. తన హాట్ హాట్ సొగసులు చూపిస్తూ ఫోటోలకు బోల్డ్ లుక్స్‌తో పోజులిచ్చింది. రీసెంట్‌గా ఐరన్ చేస్తున్నట్లు బిల్డప్ ఇస్తూ బ్యూటిఫుల్ స్మైల్, కలర్ ఫుల్ డ్రెస్సులో అదరగొట్టింది.హీరోయిన్‌కి ఉండాల్సిన అన్నీ క్వాలిటీస్ ఉన్నప్పటికి ఫస్ట్ సినిమాలో నెగిటివ్ షేడ్ ఉన్న పాత్ర చేయడం వల్లే ఏమో ఆమెను అలాంటి పాత్రలకే పరిమితం చేశారు డైరెక్టర్లు. ఇక కుర్రవాళ్లు కూడా ఆమెను అలాగే అందాలు ఆరబోసే పాత్రల్లో కనిపిస్తేనే చూడాలని ముచ్చటపడుతున్నారు.

## పూజల పేరుతో మహిళను బెదిరించి
### లైంగిక దాడికి పాల్పడిన పూజారి

బెంగళూరుకు చెందిన ఓ మహిళ(38) జీవన సమస్యలతో కొట్టుమిట్టాడి కేరళలోని ఓ ఆలయంలో పూజలు చేయడానికి వెళ్ళింది. అక్కడ పూజలు చేస్తే సమస్యలు తొలగిపోతాయని నమ్మించిన పూజారి అరుణ్ పూజలు కఠినంగా ఉంటాయని మహిళను ఒప్పించాడు. మహిళ ఒంటిపై నూలు పోగు లేకుండా చేసి పూజలో పాల్గొనేలా చేశాడు.. విపరీత భయానికి గురైన మహిళ పూజలు అయిపోయాక ఇంటికి తిరిగి వెళ్ళింది. ఇంటికి వెళ్ళిన మహిళను పూజారి అరుణ్ మళ్ళీ రావాలని బలవంతం చేశాడు.. మహిళ బట్టలు లేకుండా పూజలో పాల్గొన్న వీడియోలు, ఫోటోలు ఉన్నాయని బెదిరించాడు. దీంతో తిరిగి పూజకు వెళ్లిన మహిళపై లైంగిక దాడి చేసి, డబ్బులు తీసుకొని ఎప్పుడూ పిలిస్తే అప్పుడు



రావాలని బెదిరించాడు. దీంతో మహిళ బెంగళూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పూజారి అరుణ్ ని అరెస్ట్ చేసి, పూజారికి సహాయం చేస్తున్న మరో వ్యక్తి కోసం గాలిస్తున్నారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

## పెద్దలు ఒప్పుకోలేదని
# ప్రేమజంట ఆత్మహత్య



పెళ్లి చేసుకుని కలిసి బతకాలనుకున్న వారి ఆశలు అడియాసలయ్యాయి. కులాంతర వివాహానికి కుటుంబ సభ్యులు నిరాకరించడంతో మనస్తాపం చెందారు. కలిసి బతకలేకపోయినా, కలిసి చనిపోవాలని నిర్ణయించచుకున్నారు. రైలుకు ఎదురెళ్లి తనువులు చాలించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆదివారం రాత్రి జరిగిందీ ఘటన.రైల్వే పోలీసుల కథనం ప్రకారం. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నమిలిగొండ గ్రామానికి చెందిన కొటె వినయ్‌కుమార్ (25), అదే గ్రామానికి చెందిన శ్రుతి (23) చిన్నప్పటి నుంచి ఒకరికొకరు తెలుసు. పక్కపక్క ఇళ్లలో నివసించే వీరి స్నేహం కాలక్రమేణా ప్రేమగా మారింది. గత ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. శ్రుతి ఇంజినీరింగ్ పూర్తిచేసి హైదరాబాద్‌లో తన సోదరి వద్ద ఉంటూ ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, వినయ్‌కుమార్ డిగ్రీ చదివి జనగామలోని ఓ ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తున్నాడు.జీవితాంతం కలిసి ఉండాలని నిర్ణయించుకున్న వినయ్, శ్రుతి తమ పెళ్లి విషయాన్ని ఇరు కుటుంబాల పెద్దలకు తెలియజేశారు. అయితే, వారి కులాలు వేర్వేరు కావడంతో పెద్దలు ఈ వివాహానికి ససేమిరా అన్నారు. దీనికితోడు శ్రుతికి ఆమె కుటుంబ సభ్యులు వేరే పెళ్లి సంబంధాలు చూడటం ప్రారంభించడంతో మనస్తాపానికి గురయ్యారు.ఈ నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లో కలుసుకున్న వినయ్, శ్రుతి అక్కడి నుంచి భువనగిరికి చేరుకున్నారు. అదే రోజు రాత్రి సుమారు 8 గంటల సమయంలో భువనగిరి శివారులోని అనంతారం రైల్వే వంతెన సమీపంలో సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళుతున్న రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.రైలు లోకోపైలట్ అందించిన సమాచారంతో రైల్వే పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాల కోసం గాలించారు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఛిద్రమైన వారి మృతదేహాలను గుర్తించారు. ఘటనా స్థలంలో పంచనామా నిర్వహించగా శ్రుతి హ్యాండ్‌బ్యాగ్‌లో ఆమె ఆధార్ కార్డు, పనిచేస్తున్న కంపెనీ గుర్తింపు కార్డు లభ్యమయ్యాయని పోలీసులు పేర్కొన్నారు. వారి సెల్‌ఫోన్లు కూడా పూర్తిగా ధ్వంసమయ్యాయి. లభించిన గుర్తింపు కార్డుల ఆధారంగా మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జనరల్ ఆసుపత్రికి తరలించారు.శ్రుతి తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు కాగా, పెద్ద కుమార్తెకు వివాహం జరిపించారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం వినయ్, శ్రుతి మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే జీఆర్పీ ఇన్‌ఛార్జి కృష్ణారావు వెల్లడించారు. ఈ ఘటన ఇరు గ్రామాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

## జూలై 1న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం



జూలై 1న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం నిర్వహించనున్నట్లు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కల్యాణం, రథోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. కల్యాణం నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై మంత్రి సోమవారం ఆలయం వద్ద సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అమ్మవారి కల్యాణం తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే లక్షలాదిమంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యూ లైన్ల ఏర్పాటుతో పాటు శానిటేషన్ కోసం అదనంగా సిబ్బందిని, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు.





## జాతీయ భద్రతా మండలితో
# అత్యవసర సమావేశానికి ట్రంప్ ఆదేశం

ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకుంటున్నాయి. ఇరు దేశాలు ఒక దానిపై ఒకటి క్షిపణి దాడులకు దిగుతుండటంతో పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన కెనడా పర్యటనను అర్ధంతరంగా ముగించుకుని స్వదేశానికి బయల్దేరారు. జీ7 సదస్సులో పాల్గొంటున్న ఆయన అక్కడి కార్యక్రమాలను కుదించుకుని అమెరికాకు తిరిగి వస్తున్నట్టు వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. స్వదేశానికి చేరుకున్న వెంటనే ఆయన జాతీయ భద్రతా మండలితో అత్యవసర సమావేశం నిర్వహించనున్నారు.ఈ విషయాలను వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ ధ్రువీకరించారు. జీ7 సదస్సులో అధ్యక్షుడు ట్రంప్ ఫలవంతమైన చర్చలు జరిపారని, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో ఒక ముఖ్యమైన ఒప్పందం కూడా కుదుర్చుకున్నారని లీవిట్ తెలిపారు. అయితే, పశ్చిమాసియాలో నెలకొన్న ప్రస్తుత యుద్ధ వాతావరణం దృష్ట్యా ఆయన తన పర్యటనను ముందుగానే ముగించుకుని అమెరికాకు బయల్దేరనున్నారని పేర్కొన్నారు. ట్రంప్ నిన్న సాయంత్రం జీ7 సభ్య దేశాల అధినేతలతో ట్రంప్ గ్రూప్ ఫోటోలో పాల్గొన్నారు. అనంతరం, 'నేను తక్షణమే తిరిగి వెళ్లాలి. ఇది చాలా ముఖ్యం' అని తోటి నేతలకు ఆయన చెప్పినట్టు సమాచారం. ట్రంప్ నిర్ణయాన్ని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ సమర్థించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గాలని, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధానికి తక్షణమే ముగింపు పలకాలని జీ7 నేతలు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అమెరికాకు తిరిగి వచ్చిన వెంటనే అధ్యక్షుడు ట్రంప్ కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. జాతీయ భద్రతా సలహాదారులతో ఆయన అత్యవసరంగా సమావేశం కానున్నారు. వైట్‌హౌస్‌లోని సిట్యుయేషన్ రూమ్‌లో సర్వసన్నద్ధంగా ఉండాలని జాతీయ భద్రతా మండలిని ట్రంప్ ఇప్పటికే ఆదేశించినట్టు తెలిసింది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలకు సంబంధించి ఆయన కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## ఒకే ఓవర్లో వరుసగా
# 5 వికెట్లు తీసిన దిగ్వేష్ రఠీ

ఈ నెల 3న ముగిసిన ఐపీఎల్ 2025 సీజన్‌లో ఓ ప్లేయర్ తన ఆట కంటే కూడా తన సెలబ్రేషన్స్‌తో బాగా ఫేమస్ అయ్యాడు. ఐపీఎల్‌లో వేలంలో తనకొచ్చిన డబ్బు కంటే కూడా తన సెలబ్రేషన్స్ కారణం ఫైన్లు ఎక్కువ కడుతున్నాడంటూ విమర్శలు ఎదుర్కొన్నాడు. ఎస్.. అతనే. సంతకాల స్టార్ దిగ్వేష్ రఠీ. ఐపీఎల్ 18వ సీజన్‌లో లక్నో సూపర్ జెయింగ్స్ తరఫున ఆడి.. సూపర్ బౌలింగ్‌తో ఆకట్టుకున్న దిగ్వేష్.. వికెట్ తీసిన తర్వాత సైన్ సెలబ్రేషన్‌తో మరింత గుర్తింపు పొందాడు. ఈ సెలబ్రేషన్స్ విషయంలో అతనికి ఫైన్లే కాదు.. ఒక మ్యాచ్ నిషేధం కూడా పడింది.ఓ స్థానిక టీ20 మ్యాచ్ సందర్భంగా దిగ్వేష్ ఈ ఘనత సాధించాడు. తన గూగ్లీ ఫ్లిప్పర్ బంతులను బ్యాటర్లు అర్థం చేసుకోలేకపోయారు. ఇన్నింగ్స్ 15వ ఓవర్ వేసిన దిగ్వేష్ వరుసగా ఐదు బంతుల్లో ఐదు వికెట్లు పడగొట్టాడు. ఇందులో మరో విశేషం ఏంటంటే.. ఆ ఐదు వికెట్లలో ఏకంగా నాలుగు వికెట్లు క్లీన్ బౌల్డ్‌గా వచ్చాయి. ఒక్కటి ఎల్‌బీడబ్ల్యూగా వచ్చింది. ప్రత్యర్థి జట్టుకు విజయానికి 6 ఓవర్లలో 113 పరుగులు కావాల్సిన క్లిష్ట పరిస్థితుల్లో బౌలింగ్‌కు వచ్చిన దిగ్వేష్.. ఆ ఈక్వేషన్‌ను మరింత కఠినంగా మార్చేశాడు. మొత్తంగా ఈ మ్యాచ్‌లో దిగ్వేష్ 7 వికెట్లు పడగొట్టాడు.

# టాలీవుడ్ టూ బాలీవుడ్



ఝుమ్మంది నాదం సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైన ఈ బ్యూటీ ఆ తర్వాత దరువు, మిస్టర్ పర్ఫెక్ట్ వంటి చిత్రాల్లో మెరిసింది. టాలీవుడ్ ఇండస్ట్రీలో ఎన్నో హిట్ చిత్రాల్లో మెప్పించిన ఈ బ్యూటీ.. ఆ తర్వాత బాలీవుడ్ షిఫ్ట్ అయ్యింది. హిందీలో బ్యాక్ టూ బ్యాక్ ఆఫర్స్ అందుకుంటూ అక్కడే సెటిల్ అయ్యింది. హీరోయిన్ గానే కాకుండా ఇప్పుడు బాలీవుడ్ ఇండస్ట్రీలో నిర్మాతగానూ రాణిస్తుంది. సొంతంగా ప్రొడక్షన్ హౌస్ స్టార్ట్ చేసి పలు చిత్రాలను, వెబ్ సిరీస్ నిర్మిస్తుంది.నివేదిక ప్రకారం , పన్ను ప్రతి చిత్రానికి రూ.1 నుండి 2 కోట్ల వరకు వసూలు చేస్తుంది. నటనతో పాటు, తాప్సీ పన్ను ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో బ్యాడ్మింటన్ జట్టుకు సహ యజమానిగా ఉంది, వివాహ ప్రణాళిక కంపెనీలో పెట్టుబడి పెట్టింది. ఆమె ప్రాంజల్ ఖండియాతో కలిసి అవుట్‌సైడర్స్ ఫిల్మ్స్ అనే ప్రొడక్షన్ హౌస్‌ను స్థాపించింది. అవి ఆమె నటనా వృత్తితో సంబంధం లేకుండా ఆదాయాన్ని రాబడుతున్నాయి. ముంబైలో తాప్సీ పన్ను తన సోదరి షాగున్‌తో కలిసి నివసిస్తుంది. వీరి ఇంటికి పన్ను పిండ్ అని పేరు పెట్టారు. అంధేరిలో ఉన్న ఈ ఇంటి ధర రూ. 10 కోట్లు.





# పూరి సేతుపతి ప్రాజెక్ట్‌లో సంయుక్త

టాలీవుడ్ అగ్ర దర్శకుడు పూరి జగన్నాథ్ ప్రస్తుతం తమిళ నటుడు విజయ్ సేతుపతితో ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. పూరిసేతుపతి అంటూ ఈ ప్రాజెక్ట్ రాబోతుండగా.. 'పూరి కనెక్ట్స్' బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ నటి టబు ముఖ్య పాత్రలో నటించబోతున్నట్లు ఇప్పటికే చిత్రబృందం వెల్లడించింది. అయితే తాజాగా ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి మరో కథానాయికను ప్రకటించింది చిత్రబృందం. ఈ సినిమాలో మలయాళీ బ్యూటీ సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త ఫొటోను పంచుకుంది. దర్శకుడు పూరి జగన్నాథ్, నటి చార్మి కౌర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తుండగా.. ఈ చిత్రంలో విజయ్ సేతుపతిని ఇంతకు ముందెన్నడూ చూడని పాత్రలో చూపించనున్నట్లు పూరి జగన్నాథ్ ప్రకటించారు. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది జూన్ చివరిలో ప్రారంభమవుతుందని సమాచారం.

## వార్తా ప్రసారం జరుగుతుండగా ఇరానియన్
# స్టూడియోపై ఇజ్రాయెల్ దాడి

ఓ లేడీ యాంకర్ ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధానికి సంబంధించిన వార్తలు చదువుతోంది. సడెన్‌గా ఆ టీవీ స్టూడియో బిల్డింగ్‌పైనే ఇజ్రాయెల్ దాడి చేసింది. వార్తల మధ్యలోనే భారీ శద్ధంతో ఆ స్టూడియో కంపించిపోయింది. పక్కనుంచి పొగ అలుముకుంది. దాంతో ఆ యాంకర్ వార్తలు ఆపేసి.. అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ భయంకర దృశ్యాలన్నీ ఆ లైవ్ టీవీ బులిటెన్‌లో రికార్డ్ అయ్యాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్‌గా మారింది. కొన్ని రోజులుగా ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర దాడులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ఇరాన్‌లోని ప్రభుత్వ టీవీ స్టూడియోలను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకొని దాడులకు తెగబడింది.కాగా ఇజ్రాయెల్ జరిపిన ఈ వైమానిక దాడిలో ఇరానియన్ రేడియో, టీవీ ఉద్యోగులు చాలా మంది మరణించారు. ఇరానియన్ మీడియా ప్రకారం.. ప్రసారం సమయంలో ఇరానియన్ స్టేట్ టెలివిజన్ రిపోర్టర్ వార్తలు చదువుతుండగా ఈ దాడి జరిగినట్లు పేర్కొన్నారు.



## మరోసారి గవర్నర్ తీరుపై విమర్శలు గుప్పించిన
# తమిళనాడు సీఎం స్టాలిన్

తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి వ్యవహారశైలిపై ముఖ్యమంత్రి స్టాలిన్ మరోసారి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఆమోదం పొందిన బిల్లులను గవర్నర్ పెండింగ్‌లో ఉంచడంపై తమిళనాడులో కొంతకాలంగా చర్చనీయాంశంగా ఉన్న విషయం విదితమే.సుప్రీంకోర్టు తీర్పు వెలువరించినా గవర్నర్ తన వైఖరిని మార్చుకోలేదని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తంజావూరులో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పేరు మీద కొత్త విశ్వవిద్యాలయం ఏర్పాటు బిల్లును గవర్నర్ పెండింగ్‌లో ఉంచారని ముఖ్యమంత్రి స్టాలిన్ విమర్శించారు. నూతన విశ్వవిద్యాలయానికి కరుణానిధి పేరు పెట్టే అంశంపై తొలుత తాను సంకోచించానని, అయితే అనేక పార్టీలు కరుణానిధి పేరు పెట్టాలని పట్టుబట్టినందున అసెంబ్లీలో బిల్లును ఆమోదించి మే 2న గవర్నర్‌కు పంపడం జరిగిందని ఆయన అన్నారు. అయినప్పటికీ, ఇంతవరకు ఆయన నుంచి ఎలాంటి స్పందన రాలేదని తెలిపారు.ఈ విషయంపై అనేకమార్లు సంప్రదించామని కూడా ఆయన పేర్కొన్నారు. గవర్నర్ చర్యపై రాష్ట్ర ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పెండింగ్ బిల్లుల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు చెప్పినా ఆయన తీరు ఏ మాత్రం మారలేదని ముఖ్యమంత్రి స్టాలిన్ బహిరంగ సభలో విమర్శించారు.తమిళనాడులో గవర్నర్ వద్ద బిల్లుల పెండింగ్ అంశంపై డీఎంకే ప్రభుత్వం గతంలో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు గవర్నర్ చర్యలను తప్పుబడుతూ కీలక ఆదేశాలు వెలువరించిన సంగతి తెలిసిందే.

### తిరుపతి-సికింద్రాబాద్
# సెవెన్ హిల్స్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రమాదం

తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న సెవెన్ హిల్స్ ఎక్స్‌ప్రెస్ పెను ప్రమాదం నుంచి త్రుటిలో బయటపడింది. సోమవారం రాత్రి ప్రయాణికులతో బయలుదేరిన ఈ రైలులో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అయితే, రైల్వే సిబ్బంది సకాలంలో స్పందించి పెను ముప్పును 12769 సెవెన్ హిల్స్ ఎక్స్‌ప్రెస్ సోమవారం రాత్రి తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు తన ప్రయాణాన్ని ప్రారంభించింది. రాత్రి సుమారు 8:55 గంటల సమయంలో రైలు ఏపీలోని శ్రీ సత్యసాయి జిల్లా, ధర్మవరం మండలం పరిధిలోని చిగిచెర్ల రైల్వేస్టేషన్ సమీపంలోకి చేరుకుంది. ఆ సమయంలో రైలు వెనుక భాగంలోని ఒక బోగీ చక్రాల వద్ద బ్రేక్ బైండింగ్ కారణంగా అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి.బోగీ నుంచి పొగలు, మంటలు రావడాన్ని గమనించిన ప్రయాణికులు భయంతో కేకలు వేశారు. వారి అరుపులు విన్న రైలు వెనుక భాగంలో ఉన్న గార్డు వెంటనే అప్రమత్తమయ్యారు. ఆయన తక్షణమే లోకో పైలట్‌కు సమాచారం అందించారు. దీంతో లోకో పైలట్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా రైలును సురక్షితంగా నిలిపివేశారు. అనంతరం గార్డు, ఇతర సిబ్బంది కలిసి బోగీ చక్రాల వద్ద వ్యాపించిన మంటలను ఆర్పివేశారు. ఈ ఘటన కారణంగా రైలు దాదాపు అరగంట పాటు చిగిచెర్ల సమీపంలోనే నిలిచిపోయింది. మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చి, సాంకేతిక సమస్యను తాత్కాలికంగా సరిదిద్దిన తర్వాత రైలు సికింద్రాబాద్‌కు తన ప్రయాణాన్ని కొనసాగించింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులందరూ ఊపిరి పీల్చుకున్నారు.